# Balyam Tirigirani Amulyam

# బాల్యం తిరిగిరాని అమూల్యం

సాహిత్యంలో బాల్య చిత్రణ

## Portrait of Child in Literature

National Seminar on 9,10, October,2015

Collaboration with Adikavi Nannaya University

Rajamahendravaram

# SOUVENIR



***Organised b***

తెలుగు, ఆంగ్ల విభాగా

**MVN JS&RVR College of Arts and Scien**

Accredited by NAAC with grade B(Score

Malikipuram-533253, E.G.Dt, Andhra Pra

Principal

D.K.Govt. College for Women (A)










ISBN 978-93-5212-012-3

Principal
D.K.Govt. College for Women (A)
NELLORE.

# ఆధునిక మహాభారతంలో బాలల సమస్యలు

డా॥ కె. కరుణశ్రీ
పి.ఆర్.ఆర్ & వి.ఎస్. ప్రభుత్వ డిగ్రీ కళాశాల,
విడవలూరు, శ్రీ పొట్టి శ్రీరాములు నెల్లూరు జిల్లా.

గుంటూరు శేషేంద్ర శర్మ రచించిన ఆధునిక మహాభారతం ఆధునిక మానవ జీవితానికి దర్పణం. ఆధునిక మానవుని జీవితంలో ఉన్న అన్ని రకాల సమస్యలతో పాటు శేషేంద్ర శర్మ ఈ గ్రంథంలో నేటి బాలలు ఎదుర్కొంటున్న అనేక సమస్యలు గురించీ ప్రస్తావించారు. ఆధునిక మహా భారతంలో ఆయన ప్రస్తావించిన సమస్యల్లో ముఖ్యమైనవి దారిద్ర్యం, ఆకలి, చదువు. దారిద్ర్యంలో నుంచే ఆకలి పుడుతుంది. ఇది ప్రపంచంలోని పేద వర్గాల వారి సమస్య. ఆకలిని, దారిద్ర్యాన్ని వేర్వేరుగా చూడలేం. తల్లిదండ్రుల నుంచి వారసత్వంగా సంక్రమిస్తున్న దారిద్ర్యం గురించి పిల్లలకు అర్థం కాక పోయినా ఆకలి బాధ మాత్రం పిల్లలకు తెలుసు. పిల్లలకు తెలియందల్లా తమ ఆకలి తల్లిదండ్రులు ఎందుకు తీర్చలేకపోతున్నారన్నదే కాబట్టి పేదవాళ్ళ పిల్లలు ఆకలిని జయించాలంటే గర్భంలోనుంచి బయటకు రాకుండా ఉండడం ఒక్కటే మార్గం అంటాడు శేషేంద్ర శర్మ.

"ఇక్కడ గర్భంలో ఉన్న శిశువు గర్భంలోనే ఉండిపోవాలి. ఈ దేశంలోకి వచ్చి ఆకలిని అని ఏడిస్తే ఫుట్‌పాత్‌లు చూపిస్తారు. పొలాలు కాదు".

ఈ దేశంలోని ప్రజలకు శ్రమ విలువ తెలియదు. కాబట్టి తమ వారసులు ఆకలితో బాధపడకుండా ఉండడానికి అడుక్కోడానికి ఫుట్‌పాత్‌లు చూపిస్తారు కానీ కష్టపడి పని చెయ్యడానికి పొలాలు చూపించరు. కాబట్టి పిల్లల ఆకలికి కారణం ముమ్మాటికీ పెద్దలే అంటాడు శేషేంద్ర శర్మ. ఈ దేశం ఎంతో అభివృద్ధి చెందుతోందని రాజకీయ నాయకులు ప్రగల్భాలు పలుకుతుంటారు. నగరాలలో భవనాలు చూపించి నాగరికత వెల్లి విరిసిందని సంబర పడుతుంటారు. కానీ "ఆకలితో నిద్రిస్తున్న ఆ పసివాడి గొంతులో నగరాల గర్వోన్నత భవనాలు వికటాట్టహాసం చేస్తున్నాయి. వాడి ఏడ్పుల్లో ఒక నాగరికత సిగ్గుతో తలవంచింది. పిడికెళ్ళతో స్వర్గాలు పట్టుకొచ్చిన ఆనిష్కపట శిశువు అశ్రులై నిద్రపోతున్నాడు. ఓ గులాబీ పొదా! నీకు సిగ్గుంటే పాడబోకు" అంటాడు - ఆకలి మంటలు అమాయక శిశువుల్ని దహిస్తుంటే చూస్తూ కూర్చోడం నాగరికతా? అని సూటిగా ఈ అనాగరిక సమాజాన్ని ప్రశ్నిస్తాడు. అయినా ఈ దేశంలో దారిద్ర్యం మరీ పెరిగిపోయింది. ఆకలితో అలమటిస్తున్న పిల్లలు ఎంగిలాకుల కోసం కొట్లాడుకునే స్థితికి దిగజారి పోయింది. దీనికి కారణం ఈ దేశంలోని భూ స్వామ్య వర్గమే కదా అని బాధపడుతాడు శేషేంద్ర శర్మ.

"స్వాగత్ హోటల్ క్రింద ఎంగిలాకుల మీద
ముసురు కుంటున్న వాళ్ళు పిల్లలు కారు
మనుషులుగా మారిన ఈగలు".

దుర్భర దారిద్ర్యంలో బాధపడుతున్న అనేక కుటుంబాల్లో పిల్లలు కేవలం ఆకలితోనే చని పోవడం లేదు. చలికాలంలో కప్పుకోడానికి సరైన దుప్పట్లు లేక ఆకలితో చలిని భరించలేక కూడా చనిపోతున్నారు.

"చలికి చనిపోయిన మా పిల్లలు
చంద్రలోకం వెళ్ళి ఆడుకుంటారు"

అంటూ చనిపోయాకైనా ఈ బాధలు లేకుండా ఆ పిల్లలు హాయిగా చంద్రలోకం వెళ్ళి ఆడుకుంటారని కవి సమాధాన పడతాడు. అంతేకాదు పిల్లల్ని ఇన్ని బాధలకు గురిచేసే వారు తప్పకుండా శిక్షించబడతారు అంటాడు కవి.

"ఇదుకో చెప్తున్నా దేశం పేరుతో జాతి పేరుతో దేశ దేశాన మన పిల్లల్ని భయకంకరమైన యుద్ధాగ్నులకూ అంతకంటే భయకరమైన జీవన దావాగ్నులకూ బలి చేస్తున్న మానవ ద్రోహులకు మరణ శిక్ష ఆసన్నమయింది"

శేషేంద్ర శర్మ ప్రస్తావించిన మరో పిల్లల సమస్య చదువు. ఈ దేశంలో తరతమ వర్గ బేదాలు లేకుండా పిల్లలందరి సమస్యా చదువే. శక్తికి మించిన భారమైన చదువులతో పిల్లలంతా ఊపిరి పీల్చలేకపోతున్నారు. అయినా ఆ చదువు పిల్లలు స్వతంత్రంగా ఎదగడానికి దోహదపడడం లేదు. స్కూళ్ళన్నీ పిల్లలను బానిసలుగా తయారు చేస్తున్నాయి. వీపు మీద వారు మోస్తున్న పుస్తకాల బరువు విజ్ఞానాన్ని పెంచడానికి కాదు. గాడిద చాకిరీ చేయించడానికి. అందుకే స్కూలుకి వెళ్తున్న పిల్లల్ని

Principal
D.K.Govt. College for Women (A)
NELLORE.

చూస్తుంటే శిలవను మోస్తున్న క్రీస్తు గుర్తుకు వస్తున్నాడంటాడు శేషేంద్ర శర్మ.

"మీరు పలకా పుస్తకాలు పట్టుకొని
పోతుంటే బాబూ మీరు శిలువలు
మోసుకుపోతున్న బాల క్రైస్తుల్లా
కనిపిస్తారు - లే బాబూ లే
నీ బాల్యంలో నుంచి లే
పుస్తకాలవతల పారేయ్"

మన ఉషస్సుల్ని పాతి పెట్టి మన దేశంలోనే మనల్ని బానిసల్ని చేసిన వాళ్ళని మట్టుపెట్టాలంటే పిల్లల బానిసత్వాన్ని సరసరాన పెంచే చదువులు మానెయ్యాలని "పుస్తకాలు పారెయ్యండి నా దేశపు పిల్లల్లారా" అని ఉద్బోధించాడు.

"ఇక్కడ భూగోళాన్ని లేత మెడలతో మోస్తున్న పిల్లలు తిరుగుతుంటారు' అంటూ శక్తికి మించిన చదువు పిల్లలకి ఎంత భారమో ఆలోచించమంటాడు కవి. ఈనాడు పెద్దలు కూడా పిల్లల పుట్టక ముందే స్కూళ్ళలో అడ్మిషన్లు తీసుకుంటున్నారు. నడక నేర్చిన దగ్గర్నుంచి స్కూళ్ళకు పంపి ఒకటో తరగతి నుంచే ఐ.ఐ.టీల కోచింగులు ఇప్పించి పిల్లల బాల్యాన్ని పెద్దలు బలిపెడుతున్నారు. ఈ స్థితిని చూసి దేశంలోని ప్రకృతి కూడా కన్నీళ్ళు పెడుతుంది. పిల్లల దయనీయమైన ఆ స్థితి మారితే కానీ దేశం మళ్ళీ శ్వాస తీసుకోలేదంటాడు కవి.

"చెట్లు ఈ దేశంలో తమ పిల్లలు ఎందుకు స్కూళ్ళకు
పోతున్నారని కన్నీళ్ళు కారుస్తాయి. పైర్లు రోదిస్తాయి...
చెట్లు తీర్మానిస్తాయి. మా పిల్లల్ని ఈడ్చుకు పోయి

బానిసలుగా చేసే వాళ్ళ ఇళ్ళల్లో, ఆఫీసుల్లో, విశ్వ విద్యాలయాల్లో ఊడిగం చేయకూడదని, బానిసల్ని తయారు చేసే కర్మాగారాలన్నీ కూలిపోతాయి. కర్మ ఆగిపోతుంది. కర్త పారిపోతాడు. స్కూళ్ళ జైళ్ళలో నుంచి పిల్లలు విముక్తులవుతారు. మళ్ళీ మబ్బులు వర్షిస్తాయి. నదులు ప్రవహిస్తాయి. అడవులు ఆకాశాలవైపు బాహువులు ఊపుతాయి. పిల్లలు పూల మిలియన్లయ్ పొలాల్లో గంతులేస్తారు. దేశం మళ్ళీ శ్వాస పీలుస్తుంది"

నేటి పిల్లలకు స్కూళ్ళే జైల్లు అంటాడు కవి. విద్యను కాదు అటువంటి విద్యా విధానాన్ని మార్చకపోతే "ప్రపంచ భూములు తొక్కుతూ తిరుగాడే దేశదిమ్మరి విప్లవం మన వీధిక్కూడా వస్తుంది. పసి పిల్లలు నిద్రలో కూడా బాంబుల కోసం కలలు" కంటారని కవి బాలల భవిష్యత్‌ను ఊహించాడు. అయినా పిల్లల బాధలు అర్థం చేసుకునే పెద్దలు ఎక్కడ. అందుకే కవి.

"బాబూ నీ చిన్ని కన్నీటి బిందువులో
ఏ సముద్రం గర్జిస్తూ ఉందో నాకు తెలుసు"

అంటాడు. దారిద్ర్యంలో, ఆకలితో, భారమైన చదువులతో సతమతమైపోతున్న పిల్లల కన్నీళ్ళలో ఉప్పెనలై ముంచెత్తే విప్లవ సముద్రాలు దాగున్నాయని పెద్దల్ని హెచ్చరిస్తాడు. అయినా లాభం లేదని చివరికి ఆకలితో, దుర్భర దారిద్ర్యంతో సతమతమయ్యే పిల్లల గురించి నేనేమీ రాయలేనని శేషేంద్ర శర్మ పద్యం ఏడ్చింది.

"ఎక్కడ తిండిలేని పసివాడు దూడను మేతకు తీసుకుపోతున్నాడో
ఎక్కడ పసితనం కూడా బతకడానికి పని చెయ్యాలో
అక్కడ నా కాళ్ళు నిజంగా తెగిపోయాయి.
నా చేతులు నిజంగా రాలిపోయాయి.
నా నాలిక పడిపోయింది.
అక్కడ నేను మహా ప్రవాహాన్ని కాదు,
అక్కడ నేను ఝంఝామారుతాన్ని కాను,
ఆ పసివాడి కాళ్ళముందు!
కడివెడు కన్నీళ్ళు పోశాను ఆ కాళ్ళ మీద
నా ఆత్మలో ముత్యాల దండ, తెగి అతని ముందు పడిపోయింది.
నా పద్యం అటువైపు చూడలేక ఏడ్చింది.

- శేషేంద్ర శర్మ, ఆధునిక మహాభారతం.



Principal
D.K.Govt. College for Women (A)
NELLORE.